ఆంధ్రజ్యోతి

andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.4, కనిష్ఠం 13.4

నిజామాబాద్

జిల్లా వార్తలు

5

శుక్రవారం 21 నవంబరు 2025



ఏసీబీ దూకుడు

వలలో చిక్కుతున్న అవినీతి చేపలు



నగరంలోని లక్ష్మీప్రియనగర్ గణేష్ కాలనీలో ఉద్యోగ సంఘం నేత కబ్జాచేసిన ప్రభుత్వ స్థలం



ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిపై ఏసీబీ అధికారులు దూకుడుగా దాడులు చేస్తున్నారు. జిల్లాలో వరుసగా ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారుల తనిఖీలు అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. ప్రజా సేవ కోసం ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో డబ్బులు చెల్లించనిదే ఏ పని కావడంలేదు. చిన్న సర్టిఫికెట్ నుంచి మొదలుకొని భవన నిర్మాణాల వరకు ఏ పనికైనా ఒక రేటు చొప్పున ప్రభుత్వ శాఖల్లో వసూళ్లు చేస్తున్నారు. సామాన్యులను ఇబ్బందులు పెడుతున్న అధికారుల తీరుపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో నాలుగైదు రోజులుగా జిల్లాలో ఏసీబీ అధికారులు చేపడుతున్న తనిఖీలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.

- పెద్ద తిమింగలాల కోసం వ్యూహరచన
- జిల్లాలో అక్రమార్కుల గుండెల్లో దడ
- లోతుగా విచారణ చేస్తున్న అవినీతి నిరోధకశాఖ అధికారులు
- మునిసిపల్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లావాదేవీలపై ఆరా
- అక్రమ 'క్లియరెన్సు'ల వేటలో యంత్రాంగం
- పక్కా వివరాల సేకరణలో నిమగ్నం..

నిజామాబాద్, నవంబరు 20, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇటీవల నిజామాబాద్ అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో, నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంలో, హైదరాబాద్‌లో జిల్లాకు చెందిన సర్వేయర్ కిరణ్‌కుమార్ ఏసీబీకి పట్టుబడిన ఘటనపై ఏసీబీ అధికారులు లోతుగా విచారణ చేపడుతున్నారు. నిజామాబాద్‌అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమంగా రిజిస్ట్రేషన్‌లు చేసిన వివరాలతో పాటు ప్రస్తు తం విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ ఇంటిపై సైతం అధికారులు సోదాలు నిర్వహించారు. పెద్దఎత్తున రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన డాక్యుమెంట్‌లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

అర్ధరాత్రి వరకు తనిఖీలు..

మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీబీ అధికారులు బుధవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు తనిఖీలు నిర్వహించారు. అక్రమ నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా అనుమతులకు సంబంధించి పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్‌లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ఆఫీసుతో పాటు పలు మండలాల్లో సర్వేయర్‌గా పనిచేసిన కిరణ్‌కుమార్ ఇంటిపై దాడిచేసిన ఏసీబీ అధికారులు ఆయన అక్రమ ఆస్తులపై లోతుగా దర్యాప్తుచేస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన పనిచేస్తున్న కాలంలో ఆయనకు సహకరించిన వారిపై కూడా ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. టీఎన్‌జీవో మాజీ నాయకుడు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డులు సుదీర్ఘకాలం పనిచేసిన ఓ ఉద్యోగ సంఘం నాయకుడి అక్రమ ఆస్తులపై కూడా ఏసీబీ అధికారులు దృష్టిపెట్టినట్లు సమాచారం.

అడ్డగోలు అనుమతులపై ఆరా..

నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఏసీబీ అధికారులు బుధవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు విచారణ చేపట్టడం కలకలం సృష్టించింది. నగరంలో అనేక భవనాల నిర్మాణాలకు అనుమతులు లేకుండానే టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతులు ఇచ్చినట్లు తెలుస్తోంది. సెట్‌బ్యాక్ నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టని వాటి వివరాలు ఏసీబీ అధికారులు సేకరించినట్లు సమాచారం. గతంలో పని చేసిన టీపీవోలపై అనేక అవినీతి ఆరోపణలు ఉండగా వారి హయాంలో నిజామాబాద్ నగరంలోని ఖలీల్‌వాడి, సరస్వతినగర్, ప్రగతినగర్ ప్రాంతాలలో ఆసుపత్రుల నిర్మాణంతో పాటు ఓ మాజీ కార్పొరేటర్ ఇంటి నిర్మాణం సైతం నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చినట్లు తెలుస్తోంది. కమర్షియల్ బిల్డింగ్‌లకు

మిగతా 8వ పేజీలో...



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సాదాబైనామాలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ టి.వినయ్‌కృష్ణా రెడ్డి

కమ్మర్‌పల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సాదాబైనామాల దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, గ్రామ పాలన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భూ భారతిలో రైతులు చేసుకున్న దరఖాస్తులను తప్పులు లేకుండా త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలని ఆదేశించారు. 2002 ఓటర్ జాబితాతోపాటు ప్రస్తుత ఓటర్ జాబితాను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి. ప్రసాద్, ఎంపీడీవో రాజా శ్రీనివాస్, ఆర్ఐ శరత్ ఉన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- సమర్థవంతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలి
- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

8

అన్ని కులాలతో కలిసి పనిచేస్తా

- మున్నూరు కాపులను ఏకతాటిపై తీసుకువస్తా
- మున్నూరుకాపు సంఘం జిల్లా నూతన అధ్యక్షుడు ధర్మపురి సంజయ్

8

వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లు బిగిస్తే చర్యలు తప్పవు

- పోలీసు కమిషనర్ సాయిచైతన్య



పాకాలలో మలావత్ పూర్ణను పరామర్శిస్తున్న మంత్రి సీతక్క

పూర్ణకు అండగా ఉంటాం..

- ప్రభుత్వ సహాయం కోసం ముఖ్యమంత్రిని కలిపిస్తాం..
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క

సిరికొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అతి పిన్నవయస్సులో ప్రపంచంలోని అన్ని పర్వశ్రేణులు అధిరోహించి రికార్డు నెలకొల్పిన మలావత్ పూర్ణ కుటుంబానికి ప్రభుత్వ నుంచి సహాయం అందించడానికి సీఎం రేవంత్‌రెడ్డిని కలిపిస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. మండలంలోని పాకాల గ్రామానికి చెందిన మాలవత్ పూర్ణ తండ్రి దేవదాస్ ఇటీవల అనారోగ్యంతో మరణించి విషయం విధితమే. మంత్రి సీతక్క ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహ్మద్‌షబ్బీర్ అలీతో కలిసి గురువారం పూర్ణ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. పూర్ణ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో పూర్ణను కలిపించి సహాయం (మిగతా 8వ పేజీలో...)

మల్టీలెవల్ మార్కెటింగ్ నిందితుల అరెస్ట్

- మోసపూరిత ప్రకటనలకు ప్రజలు ఆకర్షితులు కావొద్దు
- పోలీసు కమిషనర్ సాయిచైతన్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

సుభాష్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీఎంబీ మల్టీలెవల్ మార్కెటింగ్ చైన్ సిస్టం వ్యాపారానికి పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసు కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నగరంలోని కెనరా బ్యాంకు పక్కన గల బీఎంబీ సంస్థలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు పొందవచ్చని చంద్రశేఖర్ ప్రసాద్ మాటలు నమ్మి బక్కన్న బీఎంబీ కంపెనీకి చెందిన యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని 84395 రూపాయలు పంపించారని తెలిపారు. బక్కన్నతో పాటు తన రక్తసంబంధికులైన వారిని కూడా కొంత మొత్తంలో నగదును పెట్టుబడి పెట్టించాడు. మొదట కొంతమేర డబ్బు వచ్చిన తర్వాత డబ్బుల విత్‌డ్రా కోసం ఎంత ప్రయత్నించినా (మిగతా 8వ పేజీలో...)



జయహో.. నిఖత్

- నిఖత్ జరీన్ మరోసారి ప్రపంచ చాంపియన్
- జిల్లా కేంద్రంలో అభిమానుల సంబరాలు

సుభాష్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిఖత్ జరీన్ మరోసారి ప్రపంచ చాంపియన్‌గా నిలచిందనే వార్త వెలువడగానే జిల్లా కేంద్రం వేడుకలతో మార్మోగింది. అభిమానులు పటాకులు పేల్చి సంబరాల్లో మునిగిపోయారు. అంతర్జాతీయ బాక్సింగ్ రంగంలో జిల్లాకు గర్వకారణంగా నిలిచిన నిఖత్ జరీన్ గ్రేటర్ నోయిడాలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 51 కిలోల విభాగంలో చైనీస్ తైఫి బాక్సర్ గూతః గ్వాన్‌ను 5-0 తేడాతో ఓడించి బంగారు పతకం కైవసం చేసుకుంది. పోటీ మొదటి రౌండ్ నుంచే దూకుడుగా ఆడిన నిఖత్ తన కచ్చితమైన పంచులతో ప్రత్యర్థిని చకితులను చేసింది. న్యాయనిర్ణేతల ఏకగ్రీవ తీర్పుతో ఆమె మరోసారి ప్రపంచ శిఖరాన్ని అధిరోహించింది. ఈ విజయం జిల్లాను ఆనందోత్సాహంలో ముంచెత్తింది. నిఖత్ విజయంపై జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాభిమానులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆమె ఇంటి వద్ద పూలమాలలు, బాణసంచాలతో వేడుకలు జరిపారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విభాగాల్లోనూ ఆమె విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ప్రతీ పాఠశాలలో శుభ్రతను పాటించాలి

- రాష్ట్ర పరిశీలకుడు శివకృష్ణ



నందిపేట కేజీబీవీని పరిశీలిస్తున్న శివకృష్ణ

నందిపేట, మాక్లూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో శుభ్రత, పాటించాలని రాష్ట్ర పరిశీలకుడు శివకృష్ణ కోరారు. గురువారం నంది పేట, మాక్లూర్ మండలాల్లోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను, కేజీబీవీలను ఆయన పరిశీలించారు. వెల్మల్ జడ్పీ హెచ్‌ఎస్ పరిసరాలను పరిశీలించి హెచ్‌ఎం గంగాధర్‌కు పలు సూచనలు చేశారు. అలాగే మాక్లూర్‌లోని మానిక్ బండార్‌లో శిథిలావస్థలో ఉన్న రెండు తరగతి గదులను కూల్చివేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాక్లూర్, నందిపేట ఎంఈవోలు అవదూత గంగాధర్, సత్యనారాయణ, ఏఎంవో శ్రీనివాస్ రావు తదితరులున్నారు.

నిధుల దారిమళ్లింపుపై విద్యాశాఖ ఆరా

- చందూరు జడ్పీహెచ్‌ఎస్‌లో అధికారుల విచారణ

నిజామాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకం నిధుల దారిమళ్లింపుపై జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. మోస్రా మండలం చందూరు జిల్లా పరిషత్ పాఠశాలలో సంబంధిత నిధులు ఖర్చు చేయకుండా ప్రధానోపాధ్యాయుడు తన సొంత ఖాతాలోకి జమ చేసుకుంటున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు అందడంతో విచారణకు ఆదేశించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులే మండల విద్యాశాఖ అధికారిగా ఉండగా ఇతర సిబ్బంది విడుదలైన నిధులు 17లక్షలకు గాను 11లక్షలు సివిల్ వర్క్స్ ఖర్చు చేయగా లక్ష స్పోర్ట్స్ మెటీరియల్‌కు ఖర్చుచేసినట్లు రికార్డులలో తేలినట్లు సమాచారం. మిగిలిన 5లక్షల నిధులను హెచ్‌ఎం 2లక్షలు మిగతా సిబ్బంది మూడు లక్షలను తమ సొంత బ్యాంకు ఖాతాల్లోకి జమచేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జిల్లా కమిషనర్ ఆఫ్ ఎగ్జామినర్

మిగతా 8వ పేజీలో...

సాలూర సొసైటీకి ఉత్తమ పురస్కారం

సాలూర, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో సాలూర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి ఉత్తమ ప్రతిభా పురస్కారం దక్కింది. రాష్ట్ర సహకార సంఘాల యూనిట్ కార్యాలయంలో గురువారం అఖిల భారత 72వ సహకార ముగింపు వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాలూర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు అల్లె జనార్దన్, సంఘ సీఈవో బస్వంత్ రావు ఉత్తమ ప్రతిభ పురస్కారాన్ని అందుకున్నారు. నల్గొండ డీసీసీబీ చైర్మన్ టీఎస్ ఆగ్రోస్ చైర్మన్ బాలరాజు చేతులమీదుగా వీరు ఉత్తమ ఉత్తమ ప్రతిభా పురస్కారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సంఘ చైర్మన్ మాట్లాడుతూ.. జిల్లాలో సాలూర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతులకు ఉత్తమ సేవలు అందించడం, అభివృద్ధి పథంలో మొదటి స్థానంలో నిలిచి ప్రతిభ పురస్కారం స్వీకరించడం హర్షణీయమన్నారు. పురస్కారానికి ఎంపిక చేసిన ప్రతి ఒక్కరికీ సంఘ పాలకవర్గం, సాలూర సొసైటీ పరిధిలోని గ్రామాల రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. సమష్టి కృషితోనే రైతులకు ఉత్తమంగా సేవలు అందించడంతో పాటు సంఘ అభివృద్ధి సాధ్యమైందని చైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు జిల్లాల సహకార సంఘాల చైర్మన్‌లు, రాష్ట్ర సహకార ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



జ్ఞాపికను అందుకుంటున్న సంఘ చైర్మన్ జనార్దన్, సీఈవో



చలి కాలం జర భద్రం

- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్ దాడి
- పెరుగుతున్న న్యుమోనియా, అస్తమా కేసులు

ఇందూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చలి గాలులు మొదలయ్యాయి. చల్లటి వాతావరణంతో జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఫ్లూ జ్వరం, ఆయాసం, స్వైన్‌ఫ్లూ కేసులు పెరుగుతున్నాయి. అస్తమా, సీవోపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డీసీజ్), అలర్జీ, న్యుమోనియా తదితర శ్వాసకోశ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. శ్వాసకోశ వ్యాధులతో రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్ త్వరగా దాడి చేస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రులకు చలి కాలం రుగ్మతలతో బాధితులు క్యూ కడుతున్నారు.

దగ్గు, ఆయాసం

వాతావరణం చల్లగా ఉండడంతో ప్రజలు 'సీవియర్ అలర్జీ బ్రాంకైటిస్' బారినపడుతున్నారు. వాతావరణం మార్పుతో వైరస్ శక్తివంతం కావడంతో ప్రజలపై దాడి చేస్తోంది. దీంతో దగ్గు, ఆయాసం, గాలిపీల్చుకోవడం వంటి సమస్యలతో బాధపడే వారి సంఖ్య బాగా పెరుగుతోంది. ఐదారు రోజుల్లో తగ్గే జబ్బు, అలర్జీలు ప్రస్తుతం వారం నుంచి రెండు వారాలు ఉంటున్నాయని వైద్యులు తెలిపారు. న్యుమోనియా, అస్తమా వంటి జబ్బులు కూడా పెరిగాయంటున్నారు.

అస్తమా ఉంటే అవస్థే

అస్తమా, న్యుమోనియా, సీవోపీడీ, గుండె వ్యాధులతో బాధపడే వారికి చలికాలం కష్టమేనని వైద్యులు అంటున్నారు. చల్లటి ప్రదేశంలో తిరిగినా, చల్లటి ఆహారం తీసుకున్నా, ఏసీ గదుల్లో ఉన్నా అస్తమా సమస్య పెరుగుతుంది. చలికాలంలో దగ్గు, జలుబు వంటి సమస్యలు వస్తే అస్తమా, న్యుమోనియా రోగులకు మరింత అసౌకర్యంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

గుండె జబ్బు బాధితులు జాగ్రత్తగా ఉండాలి

చలికాలంలో గుండె జబ్బులు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. బ్లాక్స్ కొలెస్ట్రాల్ ఉన్న వారిలో రక్తనాళాల్లో

మిగతా 8వ పేజీలో...

తగ్గిన తేమ శాతం

వాతావరణ మార్పులతో చల్లటి గాలులకు శరీరం తెల్లగా పొడిబారినట్లు మారిపోతోంది. పెదవులు పగిలిపోయి, ముఖం కాంతి హీనంగా మారుతోంది. అరికాళ్ల పగుళ్ల ఏర్పడుతున్నాయి. శరీరంలో తేమ శాతం తగ్గడంతో చర్మ రక్షణ శక్తి తగ్గి దురదలు వస్తాయంటున్నారు. ముఖంపై పొడిబారిపోవడం వల్ల పగుళ్ల వస్తాయని వైద్యులు వివరించారు. చేతులపై పగుల మాదిరిగా తెల్లటి గీతలు వస్తాయంటున్నారు. ఈ తరహా సమస్యలు మధుమేహం రోగులకు వస్తే ఇబ్బందులుంటాయని, ఇన్‌ఫెక్షన్ పెరుగుతుందని పేర్కొంటున్నారు.



నీరు వేడిచేసి తాగాలి..

: డాక్టర్ రాజేంద్రప్రసాద్, పల్మనాలజిస్ట్

శ్వాసకోశ, చెవి, ముక్కు, గొంతు సమస్యలున్నవారు చలికాలంలో జాగ్రత్తగా ఉండాలి. నీరు వేడిచేసి వడపోసుకుని తాగాలి. వెచ్చని దుస్తులు ధరించాలి. శరీరం పూర్తిగా కవర్ అయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లటి పానీయాలు, ఐస్‌క్రీమ్‌లు తీసుకోవద్దు. గొంతునొప్పి ఉన్న వారు ప్రతిరోజూ రెండుసార్లు వేడి చేసిన నీటిలో కొంచెం ఉప్పు వేసి వాటిని పుక్కిలించి ఉమ్మి వేయాలి. ఐదారుసార్లు చేయాలి. ఇలా ఉదయం సాయంత్రం చేస్తే గొంతు నొప్పి తగ్గే అవకాశముంది. ఫ్రిజ్‌లో పెట్టిన నీరు తాగొద్దు. వేడి ఆహారం తీసుకోవాలి. ఈఎన్‌టీ సమస్యలున్న వారు వైద్యులను సంప్రదించి వారి సలహాలు పాటించాలి.

దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధం కండి

- కేవైసీ పేరుతో 27 లక్షల మంది కూలీలను తొలగించిన సర్కారు
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్

8

ఎన్నికల పరిశీలకుల నియామకం

8

టీయూ పరిధిలో డిగ్రీ పరీక్షలు ప్రారంభం

8

జాతీయ జంబోరికి సిరికొండ చిన్నారులు

క్రైం సమాచారం

యువకుడి ఆత్మహత్య


ప్రశాంత్ (ఫైల్)

మోపాల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని కంజర్ గ్రామానికి చెందిన ప్రశాంత్ (35) బుధవారం తన పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు వివరించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఉరేసుకొని మహిళ..

రామారెడ్డి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఓ మహిళ ఆరోగ్యం బాగాలేక ఇంట్లోనే ఉరేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన తుప్పతి మమత (28) ఫిట్స్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది మనోవేదనతో ఇంట్లో దూలానికి ఉరేసుకుంది. మృతురాలి తల్లి భాగవ్వ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యా దు చేయగా ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైలు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

సుభాష్‌నగర్, నవంబరు 20, (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని ప్రభాస్ అనే వ్యక్తికి తీవ్రగాయాలైనట్లు రైల్వేస్టేషన్ మేనేజర్ హరికృష్ణ, రైల్వే హెడ్ కానిస్టేబుల్ హన్మాండ్లు తెలిపారు. డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ యార్డు వద్ద పట్టాలు దాటుతుండగా.. గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో ఎడమకాలు తెగిపోయిందని వివరించారు. బాధితుడిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారన్నారు.

పోలీసులతో దురుసు ప్రవర్తన.. అరెస్టు

నందిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలీసులతో దురుసుగా పవర్తించి విధులకు ఆటంకం కలిగించిన ఎర్రం పవన్, ఎర్రం చరణ్, ఎర్రం కిరణ్ అనే యువకులను గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై జి.శ్యామ్‌రాజ్ తెలిపారు. ఈ నెల 19న సాయంత్రం నందిపేట నుంచి షాపూర్ వెళ్లే రోడ్డులో ఎస్సై-2 రామ్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేయగా ద్విచక్రవాహనంపై వస్తున్న అంబకాటి పోశెట్టి అనే వ్యక్తిని డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తుండగా.. వెనకాలే ఉన్న ఎర్రం పవన్ పోలీసులతో దురుసుగా ప్రవర్తించాడు. స్టేషన్‌కు సంబంధించిన ట్యాబ్, డీడీమిషన్, కానిస్టేబుల్ విజయ్ మొబైల్ లాక్కొని ధ్వంసం చేసి వాగ్వాదానికి దిగాడు. అతనితో పాటు నందిపేటకు చెందిన ఎర్రం చరణ్, ఎర్రం కిరణ్ దురుసుగా ప్రవర్తించి పోలీసుల విధులకు ఆటంకం కలిగించారు. దీనిపై ఎస్సై-2 రామ్ ఫిర్యాదు మేరకు ఎస్సై జీశ్యామ్ రాజ్ కేసు నమోదు చేసి ముగ్గురిని కోర్టులో హాజరుపర్చారు.

అల్ప్రాజోలం పట్టివేత

సుభాష్‌నగర్, నవంబరు 20, (ఆంధ్రజ్యోతి): నిషేధిత మత్తుపదార్థాలను తరలిస్తున్న ముగ్గురిని నార్కోటిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు రూ.1.50 లక్షల విలువైన 150 గ్రాముల అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నామని నార్కోటిక్స్ సీఐ పూర్ణేశ్వర్ తెలిపారు. నగర శివారులోని గంగాస్థాన్ సమీపంలో అల్ప్రాజోలం తరలిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, రాజాగౌడ్, సుజిత్‌గౌడ్‌ను అరెస్టు చేసినట్లు ఆయన వివరించారు.

పొగాకు పదార్థాల స్వాధీనం..

సుభాష్‌నగర్: నిషేధిత పొగాకు పదార్థాలను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టుచేసినట్లు ఆర్‌పీఎఫ్ ఎస్సై సాయారెడ్డి తెలిపారు. రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం నంబర్1లో గురువారం తనిఖీలు చేస్తుండగా అబ్దుల్ అనిస్ వద్ద సుమారు వివిధ రకాల రూ.3వేల విలువైన 80 ప్యాకెట్ల నిషేధిత పొగాకు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనిష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

రైల్వే గేటును ఢీకొట్టిన వాహనదారుడిపై కేసు

బోధన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గురువారం ఉదయం రాయలసీమ ఎక్స్‌ప్రెస్ బోధన్ నుంచి నిజామాబాద్ వైపు వస్తున్న సమయంలో రైల్వే సిబ్బందిని గేటును వేశారు. ఓ వాహనదారుడు గేటు కింద నుండి వెళ్లడంతో గేటు దెబ్బతింది. గేట్‌మెన్ రైల్వే పోలీసులకు సమాచారం అందజేశారు. రైల్వే సీఐ సుబ్బారెడ్డి రైల్వే గేటును పరిశీలించారు. గేటు ధ్వంసానికి కారణమైన వాహనదారుడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

డయల్ 100 సేవల దుర్వినియోగం.. జైలు

మెండోర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి డయల్ 100 సేవలను దుర్వినియోగం చేసిన మెండోరా గ్రామానికి చెందిన సందేశ్‌బాబు కు 4 రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై సుహాసిని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జైలు శిక్ష విధించారని వివరించారు.

కస్తూర్బా విద్యార్థినికి విషపురుగు కాటు

హుటాహుటిన ఆసుపత్రికి తరలింపు


చికిత్స పొందుతున్న విద్యార్థిని

రాజంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఓ విద్యార్థికి విషపురుగు కాటువేయడంతో గమనించిన తోటి విద్యార్థులు, సిబ్బంది ప్రిన్సిపాల్ శ్రీవాణికి తెలపగా హుటాహుటిన కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా విద్యాధికారి రాజు విద్యార్థిని పరామర్శించారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు విద్యార్థికి ఎలాంటి అపాయం లేదని ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్‌ను ఫోన్లో సంప్రదించగా.. విద్యార్థిని ఆడుకుంటున్న సమయంలో విద్యార్థికి ఏదో కరిచినట్లు అనిపించడంతో వెంటనే తీవ్రంగా నొప్పిరావడంతో వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఎలాంటి అపాయం లేదని, అన్ని ఆరోగ్య పరీక్షలు నిర్వహించారాని, ప్రస్తుతం కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని తెలిపారు.

తాను మరణించి.. నలుగురికి జీవం పోసి


నర్సారెడ్డి (ఫైల్)

ఆర్మూర్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాను మరణించినా.. నలుగురికి జీవం పోసేలా ఓ వ్యక్తి అవయవదానానికి ముందుకొచ్చి మృతుడి కుటుంబీకులు తీసుకున్న నిర్ణయం ఆదర్శంగా నిలిచింది. ఆర్మూర్ మునిసిపల్ పరిధిలోని పెర్కిట్ కోటార్మూర్‌కు చెందిన 7వ వార్డు మాజీ కౌన్సిలర్ ఇట్టెడి నర్సారెడ్డి(48) హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్సపొందుతూ బ్రేన్‌స్ట్రోక్‌తో మృతిచెందారు. కాగా కుటుంబీకులు అవయవదానికి ముందుకొచ్చి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. జీవన్‌దాన్ సంస్థకు అవయవదానం చేస్తున్నట్లు ఒప్పందం కుదుర్చుకున్నారు.

బాధ్యతలు స్వీకరించిన సొసైటీ చైర్మన్

నవీపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నవీపేట సొసైటీ చైర్మన్ న్యాలకంటి అబ్బన్న హైకోర్టు ఉత్తర్వుల మేరకు గురువారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పదవీకాలం ముగిసిన పలు సొసైటీల పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడగించగా మరికొన్ని సొసైటీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సొసైటీల చైర్మన్‌లు తమ పదవీ కాలాన్ని పొడగించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. పదవీకాలం పొడగింపునకు సంబంధించి డీసీవో ఉత్తర్వులు జారీచేయగా ఆ కాపీని చైర్మన్ మహేష్‌కు అందజేశారు. పాలకవర్గం సభ్యులు బాధ్యతలు స్వీకరించారు.

చివరి మజిలీకి దారేది..!



- చెరువులోనే వైకుంఠధామం
- సంతోష్‌నగర్ తండాలో వృథాగా నిర్మాణం
- అంత్యక్రియలకు అవస్థలు పడుతున్న జనం
- అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చివరి మజిలీ స్థలం

సంతోష్‌నగర్ తండాలో చెరువులో నిర్మించిన వైకుంఠధామం

మనిషి ఎన్నేళ్లు బతికినా చివరికి చనిపోవల్సిందే. చనిపోయిన వారి అంత్యక్రియలు నిర్వహించడానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండటానికి గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్నిగ్రామాల్లో వైకుంఠధామాలను నిర్మించి అన్ని సౌకర్యాలు కల్పించింది. కానీ క్షేత్రస్థాయిలో అధికారులకు అవగాహన లోపం కారణంగా ఇష్టారీతిన నిర్మాణాలు చేపట్టారు. ఇదే పరిస్థితి మండలంలోని సంతోష్ నగర్‌తండా పంచాయతీ పరిధిలో చెరువులోనే వైకుంఠాధామం నిర్మించడంతో ప్రజలు అంత్యక్రియలకు అవస్థలు పడుతున్నారు. - భీమ్‌గల్ రూరల్

మండలంలోని సంతోష్‌నగర్ తండా పంచాయతీలో నాలుగేళ్ల కిందట రూ.12 లక్షలతో తండా దగ్గర ఉన్న చెరువు అనుకుని వైకుంఠధామమ్ నిర్మించారు. ఏటా భారీ వర్షాల కారణంగా చెరువు నిండుకుండలా మారి.. వైకుంఠధామం మునిగిపోతోంది. దీంతో తండాలో ఎవరైన చనిపోతే అంత్యక్రియలు చేయడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నవంబరు నెల పూర్తికావొచ్చినా వైకుంఠధామం వరకు నీరుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే మేలు..

అధికారుల నిర్లక్ష్యం కారణంగా రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన వైకుంఠధామం వృథాగా మారింది. అధికారులు స్పందించి అంత్యక్రియలు చేపట్టడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం..



సంతోష్‌నగర్ తండాలో ప్రభుత్వ భూమి లేకపోవడంతో బైడి చెరువు శిఖం భూమిలో వైకుంఠధామం నిర్మించాం. ఈసారి భారీ వర్షాలు కురవడంతో వైకుంఠధామంలోకి వరద వచ్చింది. నీటి ప్రవాహం తగ్గక వరద రాకుండా ప్రహరీ నిర్మిస్తాం. అంత్యక్రియలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. - జావిద్ అలీ, ఎంపీవో


మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఏర్గట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన మాజీ జడ్పీటీసీ ఎమ్మెల్యే సమక్షంలో గురువారం కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే మాజీ జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, వీడీసీ ఉపాధ్యక్షుడు ఎట్టె అరుణ్ యాదవ్‌కు కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజాపూర్ణానందం, మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ జక్కని మధుసూదన్, సొసైటీ చైర్మన్‌లు శ్రీనివాస్‌రెడ్డి, చిన్న నర్సయ్య, బద్దం ప్రభాకర్, కొలిప్యాక శ్రీనివాస్‌రెడ్డి, హన్మండ్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


కోటగిరిలో రాస్తారోకో నిర్వహిస్తున్న వినాయక్‌నగర్ కాలనీవాసులు

మద్యం దుకాణంతో అవస్థలు పడుతున్నాం

కోటగిరి,నవంబరు20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎత్తొండ రోడ్డులో ఉన్న వైన్స్‌ను తొలగించాలని వినాయక్‌నగర్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. వినాయక్‌నగర్ కాలనీ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వచ్చిన కాలనీవాసులు బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ప్రధాన రహదారిలో ఇళ్ల మధ్య వైన్స్ ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోయారు. మహిళలు, పిల్లలు, యువతి, యువకులు రోడ్డుపై వెళ్లాలంటే అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. ఈ సమస్యపై గతంలో సంబంధిత శాఖ అధికారులకు, ఎమ్మెల్యే పోచారంశ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేసిన ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు శివరాజ్, రాజు, విజయ్, లింగారాం, ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.

వంట మనిషి పోస్టులకు దరఖాస్తులు

ఆర్మూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీ ఉన్న 2వంట మనిషి పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రత్యేకాధికారి వి.గంగామణి తెలిపారు. స్థానిక మహిళా అభ్యర్థినులు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. సంబంధిత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఫొటోలతో కేజీబీవీలో ఈ నెల 23వ తేదీలోగా తమ దరఖాస్తులను అందజేయాలని కోరారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న టీఎన్జీవో జిల్లాధ్యక్షుడు సుమన్

ఆర్మూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్, కార్యదర్శి నేతికుంట శేఖర్ పేర్కొన్నారు. పట్టణంలో గురువారం టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సంఘం ఆవిర్భావం, దాని ప్రాముఖ్యతను వివరించారు. ప్రతీ ప్రాథమిక సభ్యుడు శాలువా, పుష్పగుచ్ఛాలతో కాకుండా సమస్యల అర్జీలతో టీఎన్జీవో కార్యాలయానికి రావాలని సూచించారు. ఈ నెల 22న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న టీఎన్జీవో మెగా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి హుస్సేన్ హాజరవుతున్నారన్నారు. అన్ని శాఖల ఉద్యోగులు, టీఎన్జీవో నాయకులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్ర కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు అహ్మద్, సంయుక్త కార్యదర్శి విశాల్‌రెడ్డి, వెల్ఫేర్ శాఖ జిల్లా అధ్యక్షుడు నాయకులు సురేష్, సుధాకర్, శశికాంత్‌రెడ్డి, విశాల్, ఎస్సారెస్పీ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్‌రాజ్, సాయికృష్ణ, భీమ్‌గల్ యూనిట్ అధ్యక్షుడు సృజన్‌కుమార్ తదితరులున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- జిల్లా ఆహార భద్రతా అధికారి సునీత


భోజనాన్ని పరిశీలిస్తున్న సునీత

ఎడపల్లి,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా ఆహార భద్రతా అధికారి టి.సునీత ఆదేశించారు. గురువారం మండలంలోని జానకంపేట జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఏజెన్సీ నిర్వాహకులు వంటగది పరిసరాల వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని పేర్కొన్నారు. ఆహార ముడి పదార్థాల కొనుగోలు బిల్లులను కలిగి ఉండాలని, నాసిరకం ఆహార ముడిపదార్థాలు ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఆమె వెంట మరో ఆహార భద్రతా అధికారి జి.నవిత తదితరులు ఉన్నారు.


మహేష్‌కుమార్ గౌడ్‌తో నందిపేట కాంగ్రెస్ నాయకులు

రోడ్డు పనులకు నిధులు మంజూరుచేయాలి

నందిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షుడు, ఎంఎల్‌సీ మహేష్‌కుమార్ గౌడ్‌ను గురువారం ప్రొద్దుటూరి పురన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నందిపేట మండలంలోని కంఠం గ్రామంలో మొరం రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన రూ.30 లక్షల నిధుల మంజూరుకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌ను కంఠం గ్రామస్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిరంజీవి, గౌతమ్, సుమన్, సురేష్, రాజశేఖర్ తదితరులున్నారు.


విద్యార్థిని భవానిని అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

రాష్ట్రస్థాయి పోటీలకు జన్నేపల్లి విద్యార్థిని

నవీపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 నుంచి 23 వరకు నల్గొండ జిల్లా అనుముల మండలం హాలియాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్-17 నెట్‌బాల్ పోటీలలో పాల్గొనేందుకు మండలంలోని జన్నేపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని డి.భవాని ఎంపికైనట్లు ఎంఈవో అశోక్ తెలిపారు. ఈ మేరకు ఆమెను డా.అరవింద్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

● **లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థి ఎంపిక**

నల్గొండ జిల్లా అనుముల మండలం హాలియలో ఈ నెల 21నుండి 23వరకు జరిగే అండర్-17 నెట్‌బాల్ పోటీలలో పాల్గొనేందుకు మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి వీ.వర్షిత్ ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ హన్మాండ్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సుదర్శన్‌రెడ్డిని కలిసిన నవీపేట నాయకులు

నవీపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డిని గురువారం నవీపేట మండల కేంద్రానికి చెందిన పలువురు నాయకులు హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండడంతో విద్యార్థినులకు అసౌకర్యంగా ఉందని సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల ప్రహరీ ఎత్తు పెంచడానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మోస్రా సాయిరెడ్డి, భగవాన్, గంగాధర్, గోపాల్, ప్రసాద్, కృష్ణమూర్తి, ఈశ్వర్ తదితరులున్నారు.


ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

సంక్షిప్త సమాచారం

నేత్రదానంతో మరొకరి చూపు..

బోధన్: నేత్రదానం మరొకరికి చూపును ప్రసాదిస్తుందని, నేత్రదానం చాలా గొప్పదని భవానీ ఆదర్శ క్లబ్ లయన్స్ ప్రతినిధి పావులూరి వెంకటేశ్వర్ రావు అన్నారు. గురువారం బోదన్‌లోని రాకాసిపేట్‌కు చెందిన ఏ.సాంబశివరావు అకాల మరణం చెందగా వారి కుటుంబ సభ్యులు నేత్రాలను బోధన్ లయన్స్ క్లబ్‌కు అందించారు. లయన్స్ ప్రతినిధులు శ్రీరాం, అశోక్ కుమార్, నల్లూరి లక్ష్మీకాంత్, శివన్నారాయణ ఉన్నారు.

అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని సిద్దులగుట్టపై అయ్యప్ప స్వామి ఆలయంలో నిత్యాన్నదాన సత్రం ఏర్పాటుచేసినట్లు అయ్యప్ప ఆలయ నిర్మాణకర్త అయ్యప్ప శ్రీనివాస్ తెలిపారు. నవంబర్ 16 నుంచి డిసెంబరు 26 వరకు స్వాములకు 41 రోజులు భిక్ష ఏర్పాటుచేశామని, స్వాములు భిక్ష స్వీకరించాలన్నారు.

ఈకేవైసీ వెంటనే పూర్తి చేయాలి..

భీమ్‌గల్ రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు ఈకేవైసీ వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీవో సంతోష్ కుమార్ అధికారులకు ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం కింద మంజూరైన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కొత్తపనులను గుర్తించి ప్రారంభించాలని, అలాగే నర్సరీల నిర్వహణ, వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. ఏపీవో నర్సయ్య, ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు పాల్గొన్నారు.

మోతెలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

వేల్పూర్: మండలంలోని మోతె గ్రామంలో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. గ్రామానికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు కలిపి రూ.2.20 లక్షల విలువైన చెక్కులు మంజూరయ్యాయని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సీఎంఆర్‌ఎఫ్ నిధుల మంజూరుకు కృషిచేసిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డిలకు కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు భగవన్‌దాస్, సురేష్, రాజేందర్, రాజేశ్వర్, గంగాధర్, హన్మాండ్లు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుడిని కలిసిన పాస్టర్లు

బోధన్: ప్రభుత్వ ప్రత్యేక సలహాదారులుగా బాధ్యతలు చేపట్టిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని గురువారం బోధన్ చర్చి పాస్టర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ అంతయ్య చౌదరి, రెవరెండ్ ఎం. ప్రభాకర్, డీ.జ్యోతిరాజ్, వివేక్ రాజ్, కిషోర్, పాస్టర్ తిమోతి, పాస్టర్ ప్రమోద్, బర్నాబాస్, పాస్టర్ రుబెన్ ఉన్నారు.

వరిలో నూతన సాగు పద్ధతులపై అవగాహన

కోటగిరి: మండలంలోని రాంపూర్ గ్రామంలో గురువారం డా.రెడ్డీస్ ఫౌండేషన్ సీజీఎం ఆధ్వర్యంలో వరిసాగులో కొత్త పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రమ్ సీడర్ పద్ధతి ద్వారా వరి విత్తనాలు నేరుగా విత్తడంపై ప్రత్యేక పద్ధతిలో అవగాహన కల్పించారు. కొత్త పద్ధతులను అవలంభించడం వల్ల కూలీల ఖర్చును అధిగమించవచ్చని ఫౌండేషన్ ప్రతినిధి వీరస్వామి పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీఎస్‌ఆర్ పద్ధతిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధికారులు అరుణ్, ప్రసాద్, రైతు కొడాలి రవి తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

కోటగిరి: పోతంగల్ మండలంలోని పోతంగల్ చెక్‌పోస్టు నుంచి హంగ్సా వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పోతంగల్ చెక్‌పోస్టు వద్ద గురువారం సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ హన్మంతు మాట్లాడుతూ.. 11 కిమీ రహదారికి రూ.30కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్, ఏజాజ్ ఖాన్, పవన్, గంగాధర్, వీరేశం, వర్ని శంకర్, గంట్ల విఠల్, హన్మంత్ రావు, శివరాజ్, గంధపు రాజు, దత్తు, దిలీప్ కుమార్, జుమ్మాఖాన్ పాల్గొన్నారు.

చేపల పెంపకంపై అవగాహన

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని రాగుల కుంట వద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ చదువుతున్న మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులకు ఆన్‌జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా చేపల పెరుగుదలపై కోఆర్డినేటర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చెరువు నీటిలోపల ఉండే ప్లవకాలు చేపల పెరుగుదలకు దోహదపడే విధానాన్ని ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. చేపల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

నవీపేట: వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఐకేపీ కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని కోరారు. మొంథా తుఫాన్‌తో పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. యాసంగి పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందుబాటులో ఉంచాలని కోరారు. దేవేందర్ సింగ్, ఒడ్డెన్న, రాంసింగ్ తదితరులున్నారు.

జాతీయ నాయకుల చిత్రపటాల వితరణ

జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నాయకుల చిత్ర పటాలను వితరణ చేశారు. గురువారం ఆర్మూర్ రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో పాఠశాలకు జాతీయ నాయకుల చిత్రపటాలను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తమ చారి, ఆర్మూర్ రోటరీ క్లబ్ ఆఫ్ మాజీ అధ్యక్షుడు రజనీష్ కిరాడు, సెక్రటరీ సత్యం, సభ్యులు సురేష్‌కుమార్, ఆనంద్, మారుతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల హక్కుల వారోత్సవాలు

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాధన సంస్థ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి నిరీక్షణ మాట్లాడుతూ.. బాలల హక్కులు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, పిల్లల అక్రమ రవాణ, లైంగిక దాడుల గురించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు వివరించారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

బోధన్: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయసేవా సంస్థ సభ్యులు, న్యాయవాది హన్మంత్ రావు అన్నారు. గురువారం బోధన్ పట్టణంలో మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది హన్మంత్ రావు, సమాజ సేవకురాలు పద్మా సింగ్ మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, నేరాలకు విధించబడే శిక్షల గురించి వివరించారు. మహిళలు సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫేక్ కాల్స్ వచ్చినప్పుడు వ్యక్తిగత సమాచారం ఎవరికి ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ శ్రీనివాస్, మెప్మా డీఎంసీ మాధురి లత, సీవోలు శ్రీనివాస్, స్త్రీనిధి ఆర్ఎం, ఆర్పీలు, సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలి

బోధన్: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్లను వేగంగా నిర్మించుకోవాలని బోధన్ మునిసిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డులలో హౌసింగ్ ఏఈ జయంత్‌తో కలిసి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, వార్డు అధికారులున్నారు.

దోపిడీకి నిరసనగా పోస్టుకార్డుల ఉద్యమం

కమ్మర్‌పల్లి: దేశాయి బ్రదర్స్ బీడీ కంపెని యాజమాన్యం కార్మికులు చేస్తున్న ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా పోస్టుకార్డుల ఉద్యమాన్ని తెలంగాణ ప్రగతి శీల బీడీవర్కర్స్ యునియన్ అధ్వర్యంలో గురువారం పోస్టుకార్డుల ఉద్యమాన్ని చేపట్టారు. తెలంగాణ ప్రగతి శీల బీడీవర్కర్స్ యునియన్ ఉమ్మడి నిజామాబాద్ కామారెడ్డి సంయుక్త జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తెలంగాణ ప్రగతి శీల బీడీవర్కర్స్ యునియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, సహాయ కార్యదర్శి సత్తెమ్మ, కార్మికులు శైలజ ఉమా, సుమలత, మానస ఉన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

కోటగిరి: పోతంగల్ మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో గురువారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ డివిజన్ షీటీమ్ హెడ్ కానిస్టేబుల్ ఆశన్న మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినుల భద్రత కోసమే షీటీమ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

పీసీసీ అధ్యక్షుడికి సన్మానం


మహేశ్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న ఆగ్రోస్ చైర్మన్ బాల్‌రాజ్

బాన్సువాడటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో గురువారం రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం రానున్న స్థానిక సంస్థల ఎన్నికల గురించి చర్చించారు. కార్యక్రమంలో బాన్సువాడ నాయకులు ఖాలేక్, ఏజాస్, గోపాల్‌రెడ్డి, నార్ల రవీందర్ గుప్త, మన్సూర్, రమేశ్ ఉన్నారు.

ప్లాట్లలో వేసిన షెడ్లు తొలగించాలి


పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్థులు

బాన్సువాడ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలం తాడ్కోల్‌లో తమ ప్లాట్లలో అక్రమంగా వేసిన షెడ్లను తొలగించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రశాంతికి పలువురు గ్రామస్థులు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. గ్రామానికే చెందిన ఓ వ్యక్తి అక్రమంగా ఆక్రమించి షెడ్లు వేసుకుని కబ్జా చేసి అక్ర మంగా ఇంటి నంబర్లను తీసుకున్నారని ఆరోపించారు. వినతిపత్రం అందించిన వారిలో రాజారం దుబ్బకు చెందిన రోజ్కేర్ ప్రతాప్ సింగ్, రత్నబాయ్, సాదుసింగ్ ఉన్నారు. వెంటనే అక్రమ షెడ్లను తొలగించి, ఇంటి నెంబర్లను రద్దు చేయాలన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రశీదులు తప్పనిసరిగా తీసుకోవాలి


మాట్లాడుతున్న ఏఈఓ జ్ఞానేశ్వర్

బాన్సువాడ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు విత్తనాల కొనుగోళ్లు చేపట్టినపుడు దుకాణాల వద్ద తప్పనిసరిగా రశీదులను తీసుకోవాలని ఏఈవో జ్ఞానేశ్వర్ అన్నారు. గురువారం బాన్సువాడ మండలంలోని కాదులాపూర్ గ్రామంలో యాసంగి పంటల సాగుపై రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. వరి పంట కొయ్యలను కాల్చవద్దని, కొయ్యలను కాల్చడం ద్వారా గాలి కాలుష్యం అవుతుందన్నారు. నీటి లభ్యత ఆధారంగా యాసంగికి అనువైన విత్తనాలను సాగుచేసుకోవాలన్నారు. ఆరుతడి పంటల సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం చేకూరుతుందన్నారు. అనంతరం రైతులతో కలిసి పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతులు భాస్కర్, గణేష్, విఠల్ నాయక్, బజరంగ్, పత్రు, పరుశురాం, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ మండలాధ్యక్షుడు సాయిలు

మద్నూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని మద్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధరాస్ సాయిలు అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్ అన్ని స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. దీనికోసం ప్రతి కార్యకర్త కలిసికట్టుగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ రాంపటేల్, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, మాజీ ఎంపీటీసీ హన్మంత్ రావు దే శాయి, మాజీ సర్పంచ్ విట్టల్ గురూజీ, నాయకులు మనోహర్ దేశాయ్, కొండగంగాధర్, హన్మాండ్లు స్వామి, రమేష్, బండి గోపి, కుషాల్, అమూల్, లక్ష్మణ్, సంగాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో దిండి ఊరేగింపు


బీర్కూర్‌లో దిండి ఊరేగిస్తున్న భక్తులు

బీర్కూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో గత 5 రోజులుగా సంత్ తుకారాం అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందులో భాగంగా గురువారం సంత్ తుకారాం మహారాజ్ దిండిని మేళతాళాల మధ్య భజనలు, కీర్తనలు చేస్తూ గ్రామంలో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు.

వాట్సాప్‌లో స్టేటస్ చూసి.. రక్తదానం


రక్తదానం చేసిన దాత బెల్కోని రవి

బాన్సువాడటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రిలో బీర్కూర్ మండలం చించోలికి చెందిన అమ్ముల సాయవ్వకు ఏ బీ పాజిటివ్ రక్తం అవసరం పడిందని డా.రమేశ్ వాట్సా‌ప్‌లో స్టేటస్ పెట్టారు. దీంతో వైద్యుడి స్టేటస్‌కి స్పందించిన బీర్కూర్ మండలం బరెంగెడ్గి గ్రామానికి చెందిన బెల్కోని రవి బాన్సువాడ ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశాడు. రక్తదానం చేసిన రవిని వైద్యులు, స్థానికులు అభినందించారు.



ప‘రేషన్’ దందా

- జిల్లాలో జోరుగా రేషన్ దందా
- రీసైక్లింగ్ జరుగుతున్నా పట్టని వైనం
- దర్యాప్తు చేస్తేనే దందాకు అడ్డుకట్ట

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు ఖర్చుచేసి పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్‌బియ్యం పక్కదారి పడుతున్నాయి. బియ్యం సేకరణకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక ముఠాలే పనిచేస్తున్నాయి. ఒక చైన్ సిస్టంలా పనిచేస్తూ ఒకరినుంచి ఒకరు ప్రజల నుంచి బియ్యం సేకరిస్తున్నారు. పెద్దమొత్తంలో సేకరించి పలువురు వ్యాపారులు రైస్‌మిల్లులకు, చేపల పెంపకానికి, పౌల్ట్రీ పరిశ్రమలకు సరఫరా చేస్తున్నారు. లేదంటే మహారాష్ట్ర లాంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలుస్తోంది.

కామారెడ్డిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కిలోకు రూ.10 వరకు కమీషన్ మిగులుతుండడంతో చాలా మంది దీనినే వృత్తిగా మలుచుకుంటున్నారు. కొనుగోలు చేసిన బియ్యాన్ని కొందరు మిల్లుల యాజమానులు సీఎంఆర్‌గా తరలిస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. అధికారులు, పోలీసులు దాడులు చేసిన సమయంలో పట్టుబడిన వారిపై 6(ఏ) కేసులు నమోదు చేస్తుండడం, పట్టుకున్న బియ్యం భారీ మొత్తంలో ఉంటే పౌరసరాఫరాల గోదాంలోకి, తక్కువ మొత్తంలో ఉంటే సమీపంలోని రేషన్ దుకాణాలకు అప్పగించి ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను కోర్టుకు అప్పగిస్తున్నారు. అత్యవసర సరకులు చట్టం 1955 చట్టంలోని 6ఏ సెక్షన్ కింద కేసులు నమోదుచేస్తున్నారు. చిన్నపాటి శిక్షలు ఉండడంతో రేషన్ బియ్యం దందాకు అడ్డుకట్టపడడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

తాజాగా సిరిసిల్ల టు నిజామాబాద్

సిరిసిల్ల నుంచి నిజామాబాద్ వైపు అక్రమంగా డీసీఎం వాహనంలో తరలి స్తున్న పీడీఎస్ బియ్యాన్ని హై దరాబాద్‌కు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పక్కా సమాచారంతో దాడులుచేసి కామారెడ్డిలో పట్టుకున్నారు. సుమారు 125 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తు వాహనానికి రిపేర్ రావడంతో కామారెడ్డిలోని నిజాం సాగర్ రోడ్డువైపు వెళ్తుండగా పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్ మెంట్ ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి, డీఎస్‌పీ శేఖర్‌రెడ్డి తెలిపారు. డీసీఎం వాహనం తో పాటు అలీం, నరేష్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని వివరించారు.

మూలాల్లోకి వెళ్లని దర్యాప్తు

జిల్లాలో రోజుల వ్యవధిలోనే అధికారులు అక్రమంగా నిల్వఉంచిన, తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకుంటున్నారు. కానీ, వాటి మూలాల్లోకి మాత్రం వెళ్లడం లేదని సమాచారం. పట్టుబడిన వ్యక్తులు ఎక్కడి నుంచి వాటిని సేకరించారు. ఎన్ని నెలల నుంచి ఈ వ్యాపారం సాగుతుంది. తదితర అంశాలపై లోతుగా దర్యాప్తు జరగకపోవడం వల్లనే కేసులు నమోదైనప్పటికీ మళ్లీ ఇదే దందా సాగించడమో లేదంటే వారి ప్రతినిధులను ఈ వ్యాపారంలో దింపి వెనుకనుంచి నడిపించడం లాంటివి చేస్తున్నారని తెలుస్తుంది.

ఇళ్ల వద్దే దందా

జిల్లావ్యాప్తంగా కొంతమంది బియ్యం వ్యాపారులు, దుకాణసముదాయాల నిర్వాహకులు, మిల్లర్లు ఆటోలలో వెయింగ్ మిషన్‌లు తీసుకుని నేరుగా లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్తూ కొనుగోలు చేస్తున్నారు. రవాణా చేసే వాహనాలకు అడ్వాన్సు మొత్తం ఇచ్చి రేషన్ బియ్యం తెప్పిస్తున్నారంటే దందా ఎంత పకడ్బందీగా జరుగుతుందో అర్థంచేసుకోవచ్చు. బియ్యం తరలింపునకు ఉపయోగించే వాహనాలను తమ పేరుపై లేకుండా జాగ్రత్తపడుతున్నారు. బియ్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు 3 సార్లు పట్టుబడితే వారిపై పీడీయాక్ట్ నమోదుచేయాలి. అయితే పట్టుబడిన సమయంలో వారి పేర్లు లేకపోవడంతో మధ్యవర్తుల మీద కేసులు నమోదవుతున్నాయి. మాచారెడ్డి, బాన్సువాడ, తాడ్వా యి మండలాలతో పాటు కామారెడ్డిలోని అనేక సార్లు పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఇటీవల కామారెడ్డిలో 47క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఓ ఇంట్లో గుర్తించి అధికారులు సీజ్‌చేశారు.

విద్యాసామగ్రి పంపిణీ


విద్యాసామగ్రి పంపిణీ చేసిన దృశ్యం

నాగిరెడ్డిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్తుమ్మెద ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన బూర్గుపల్లి ప్రవీణ్ కుమార్ గురువారం పరీక్ష అట్టలు, జామెంటరీ బాక్సులు, నోట్ బుక్కులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన చకిలం సుశీలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె దత్తత పుత్రుడైన ప్రవీణ్ కుమార్ సుమారు రూ.12 వేలు వెచ్చించి ఈ వితరణ కార్యక్రమం చేపట్టారు. 17 ఏళ్లుగా ఈ సేవాకార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరాజు, నాయకులు ఆంజనేయులు, పడమటి దుర్గేష్, వసీముద్దీన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

గోదాం నిర్మాణానికి స్థల పరిశీలన

రామారెడ్డి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలో 250 మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. గురువారం మాచారెడ్డి సొసైటీ చైర్మన్ స్వామి గౌడ్ నేతృత్వంలో గోదాం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు షేక్ చాంద్, మాస్మోడిన్, సీఈవో చంద్రరెడ్డి పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

బతుకమ్మకుంటలో కమ్యూనిటీ కాంటాక్ట్

కామారెడ్డిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలో గురువారం ఉదయం ఏఎస్‌పీ చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 235 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో 224 ద్విచక్రవాహనాలు ఉండగా, నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 27 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రవాణా నియమాలను ఉల్లంఘించిన 11 ఆటోలను కూడా తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి వాహనదారులు విధిగా వాహనానికి సంబంధించిన ధృవపత్రాలు కలిగి ఉండాలని, గంజాయి, మాదకద్రవ్యాలు వంటి నిషేధిత పదార్థాలకు, అసాంఘిక కార్యకలపాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. ప్రజలకు శాంతిభద్రలతో కూడిన సమాజాన్ని అందించడానికి పోలీసుశాఖ అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సీఐ నరహరి, సిబ్బంది పాల్గొన్నారు.

‘బీసీ రిజర్వేషన్లకు రక్షణ కల్పించాలి’

కామారెడ్డిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలని బీసీ జేఏసీ నాయకులు గురువారం మంత్రి సీతక్కకు వినతిపత్రం అందించారు. పార్టీ పరంగా ఇచ్చే రిజర్వేషన్లు వద్దని, చట్టబద్దంగా రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో చేర్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని కోరారు. డిసెంబర్‌లో జరిగే పార్లమెంట్ సమావేశాల్లోపు సీఎం నేతృత్వంలో అఖిలపక్షాన్ని డిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి చట్టబద్ధంగా బిల్లు ఆమోదం పొందేలా చూడాలన్నారు. రాహుల్‌గాంధీ ఎన్నికల సమయంలో రాష్ట్రంలో ఇచ్చిన మాట ప్రకారం ఎవరి వాటా వారికి దక్కాలన్నారు. నాయకులు నాగరాజు, లక్ష్మణ్, కొత్తపల్లిమల్లన్న, రాజేందర్, వినోద్‌నాయక్, రమేష్ పాల్గొన్నారు.

ప్రయాణమే ప్రమాదమాయె

- కమ్మర్‌పల్లి జాతీయ రహదారిపై కొరవడిన చిత్తశుద్ధి
- రహదారి కనిపించకుండా పెరిగిన చెట్ల కొమ్మలు, పిచ్చిమొక్కలు
- మలుపులు కనిపించక ప్రమాదాలు


కోతకు గురైన రహదారి


రహదారి కనిపించకుండా పెరిగిన చెట్ల కొమ్మలు

కమ్మర్‌పల్లి, నవంబరు 20: (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని నిజామాబాద్- జగదల్‌పూర్ 63వ జాతీయరహదారిపై సమస్యలు రాజ్యమేలుతున్నాయి. అయినా నేషనల్ హైవే అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఎదురవుతున్నాయి. జాతీయరహదారికి ఇరువైపులా చెట్లకొమ్మలు, ముండ్లపొదలు, పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగాయి. దీంతో రహదారిపై మూలమలుపులు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా పట్టింపు కరువైంది.

వాహనాలు కనిపించని పరిస్థితి

చెట్లకొమ్మలు పెరిగిపోయి రోడ్డుకు అడ్డంగా పెరగడంతో మూలమలుపులు సరిగా కనిపించడం లేదు. దీంతో ఎదురుగా వచ్చేవాహనాలు కనిపించక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మరో వైపు జాతీయరహదారికి ఇరుపక్కలా ముళ్లపొదలు కమ్మేయడంతో రోడ్డు ఎంతవరకు ఉందో కనిపించక వాహనాలకు దారిఇచ్చే క్రమంలో ఇతర వాహనాలు రోడ్డు కిందికిపోయి ప్రమాదాలకు లోనవుతున్నాయి.

కనిపించని సూచికబోర్డులు..

ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుల వద్ద గతంలో ఏర్పాటుచేసిన సూచిక బోర్డులను సైతం చెట్లకొమ్మలు కమ్మేయడంతో అవి కనిపించడం లేదు. గతంలో సంబధితశాఖ సిబ్బంది నెలకోసారి చెట్ల కొమ్మలు తొలగించడం, ముళ్ల పొదలను తొలగించడం, గుంతలు ఏర్పడిన చోట మొరం పోయడం లేదా బీటీతో కప్పివేయడం వంటి పనులపై దృష్టి సారించేవారు. కొద్దికాలంగా ఆ పనులు చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పిటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


సూచిక బోర్డును కమ్మేసిన చెట్ల కొమ్మలు

నిలిచిన సైన్స్‌ల్యాబ్ నిర్మాణ పనులు


మధ్యలో నిలిచిపోయిన జడ్పీ ఉన్నత పాఠశాల సైన్స్‌ల్యాబ్ నిర్మాణ పనులు

నాగిరెడ్డిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద జిల్లా ప రిషత్ ఉన్నత పాఠశాలకు మంజూ రైన సైన్స్ ల్యాబ్ నిర్మాణం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పాఠశాలకు 2023-24 సంవత్స రంలో రూ.13.25 లక్షలతో సైన్స్ ల్యాబ్ మంజూరైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరాజు తెలిపారు. ఆరు నెలల క్రితం ల్యా బ్ నిర్మాణ పనులు చేపట్టిన కాం ట్రాక్టర్ స్లాబ్ లెవల్ వరకు పను లు పూర్తిచేసి మధ్యలోనే పనులు నిలిపివేశాడన్నారు. చేసిన పనులకు సంబంధిత కాంట్రాక్టర్ కు బిల్లులు మంజూరు కాలేదని చెబుతున్నారు. ఈ కారణంగానే నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వం తగుచర్యలు తీసుకొని సైన్స్ ల్యాబ్ నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలని పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

సూక్ష్మ నీటిపారుదల గణన చేపట్టాలి


మద్నూర్ రైతువేదికలో మాట్లాడుతున్న తహసీల్దార్

మద్నూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో తహసీల్దార్ ముజీబ్ అధ్యక్షతన సూక్ష్మ నీటిపారుదల, నీటి వనరుల గణన నమోదుపై గణనదారులకు శిక్షణ న్విహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని నీటి కుంటలు, చెరువులు, సూక్ష్మ నీటిపారుదల వనరులను లెక్కించనున్నామన్నారు. వీటిని మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా నీటి వనరుల లభ్యత తెలుస్తుందని చెప్పారు. ఏఎస్‌వో దత్తు, ఎన్యూమేటర్స్ పాల్గొన్నారు.

బీర్కూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఏడవ సూక్ష్మ నీటిపారుదల గణన, నీటి వనరుల గణన నమోదుపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సాయిభుజంగరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. మొబైల్‌యాప్ ద్వారా నీటి కుంటలు, చెరువులు, వివిధ సూక్ష్మ నీటిపారుదల వనరులను లెక్కించనున్నామని చెప్పారు. తద్వారా నీటి వనరుల లభ్యత గురించి తెలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కార్తీక్, డిప్యూటీ తహసీల్దార్ రవి కుమార్, ఎంపీఎస్‌వో వెంకట రమణ, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

బూటకపు ఎన్‌కౌంటర్‌లను ఖండిస్తున్నాం

- సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కామారెడ్డిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల బూటకపు ఎన్‌కౌంటర్‌లను ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఆదివాసీల కాళ్లకింద ఉన్న ఖనిజ సంపదను, అడవులను అమెరికా, బ్రిటన్, జర్మనీ, జపాన్ దేశాలకు చెందిన పెట్టుబడిదారులతో పాటు అదాని, అంబానీలకు కట్టబెట్టిందుదన్నారు. అలా కట్టబెడుతున్నందుకు కుదుర్చుకున్న ఒప్పంద ప్రకారం నక్సలైట్లపేరుతో అమాయకులైన ఆదివాసీలను చంపుతూ, మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్‌లు చేస్తుందని ఆరోపించారు. దొరికిన వారిని కోర్టులో హాజరుపరచకుండా చిత్రహింసలకు గురిచేసి ప్రాణాలు తీస్తే కోర్టులు ఎందుకని ప్రశ్నించారు. ఈ రాజ్యహింసను మానవహక్కుల సంఘాలు, ప్రజాసంఘాలు, విద్యార్థులు, మేధావులు ఖండించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకట్‌గౌడ్, మోతిరాంనాయక్, కొత్తనర్సింలు, మోహన్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి పనులు కొనసాగించాలి

- మంత్రి సీతక్కకు దోమకొండ నాయకుల వినతి

దోమకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దోమకొండ మండల కేంద్రంలో 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి పనులను వెంటనే ప్రారంభించాలని మాజీ జడ్పీటీసీ తిరుమలగౌడ్ మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, ఎంపీ సురేష్‌షెట్కార్‌లకు వినతి పత్రం అందించారు. ఫిబ్రవరి 28న 50 పడకల ఆస్పత్రిగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఫైనాన్స్ అనుమతి చేసినట్లు తెలిపారు. ఇప్పుడున్న ఆస్పత్రిలో 50 పడకల ఆస్పత్రిని నిర్వహించేందుకు ఆదేశాలు జారీచేయాలని కోరారు. దోమకొండలో 10 పడకల ఆస్పత్రి నుంచి 30 పడకల ఆస్పత్రికి మార్చడంతో పాటు ఇప్పుడు 50 పడకల ఆస్పత్రి సైతం షబ్బీర్‌అలీ మంజూరు చేయించాడని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, శంకర్‌రెడ్డి, నయిమ్ పాల్గొన్నారు.


మంత్రికి వినతి పత్రం అందిస్తున్న దోమకొండ మాజీ జడ్పీటీసీ తిరుమల గౌడ్, నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

» ఎన్నికల నిర్వహణ అధికారులతో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా సమన్వయంతో పనిచేస్తూ, ఎన్నికలను సాఫీగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని హితవు పలికారు. సందేహాలుంటే ఉన్నతస్థాయి అధికారులను సంప్రదించి ముందుగానే నివృత్తి చేసుకోవాలని, ఎన్నికల నిర్వహణలో పొరపాట్లకు ఆస్కారం ఉండకూడదని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరువాత నామినేషన్ల స్వీకరణ నుంచి ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉంటూ, విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, డీఆర్డీఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ రావు, డీఈఓ అశోక్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఏసీబీ దూకుడు..

(5వ పేజీ తరువాయి)

రాత్రికి రాత్రే టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. జిల్లా రోడ్డులో బహుళ అంతస్తుల భవనం నిర్మాణానికి కేవలం రెండు అంతస్తుల అనుమతి తీసుకుని ఐదంతస్తులు నిర్మించినట్లు ఏసీబీ అధికారుల విచారణలో తేలినట్లు సమాచారం. ఇలా రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో టౌన్‌ప్లానింగ్ అధికారులు యథేచ్ఛగా నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఏ చర్యలు తీసుకుంటారో తేలాల్సి ఉంది.

సర్వేయర్ కిరణ్‌కుమార్ వెనక పెద్ద చేప

అవినీతి నిరోధకశాఖ దాడుల్లో చిన్న చేపలు దొరుకుతుండగా వారికి సహకరించిన పెద్ద తిమింగలాలు మాత్రం చిక్కడంలేదు. నిజామాబాద్‌లో సుమారు 25 ఏళ్ల పాటు సర్వేయర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ఏడికి సీసీగా పనిచేసిన కిరణ్‌కుమార్ హైదరాబాద్‌లో ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఘటన జిల్లాలో కలకలం సృష్టించింది. ఆయన జిల్లాలో సర్వేయర్‌గా పనిచేసిన సమయంలో అనేక మంది అవినీతి అక్రమాలకు సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆయనను ముందుంచి వెనక ఉండి నడిపించింది మాజీ టీఎన్‌జీవో నాయకుడు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు కార్యాలయంలో సుదీర్ఘకాలం పనిచేసిన ఉద్యోగ సంఘం నాయకుడు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో ఏసీబీ అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఉద్యోగ సంఘం నాయకుడిగా చలామని అవుతూ అధికార పార్టీ నేతలతో చట్టాపట్టాలేసుకుని తిరిగి అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆర్మూర్ డివిజన్‌లోని ఓ గ్రామంలో 11 ఎకరాల సొసైటీ భూమిని కబ్జాచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నగరంలోని లక్ష్మిప్రియనగర్ కాలనీ గణేష్‌నగర్‌లో 800 గజాల ప్రభుత్వ భూమిని కబ్జాచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ నేత ఉంటున్న ఇంటిపక్కన ప్లాటును సైతం ప్లాట్ ఓనర్‌ను బెదిరించి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా సర్వే అండ్ ల్యాండ్ రికార్డు విభాగంలో అన్ని తానై వ్యవహరించి ప్రస్తుతం వేరే శాఖకు మారిన సదరు ఉద్యోగ సంఘం నేత అక్రమాలపై ఏసీబీ విచారణ చేస్తున్నట్లు సమాచారం.

ఎన్నికల పరిశీలకుల నియామకం

సుభాష్‌నగర్, నవంబరు 20, (ఆంధ్రజ్యోతి): ఎన్నికల పరిశీలకులుగా వెనకబడిన తరగతుల సంక్షేమ పాఠశాల ప్రత్యేక అధికారి శ్యాంప్రసాద్‌లాల్, వ్యయ పరిశీలకుడిగా కామారెడ్డి జిల్లా ఆడిట్ అధికారి జైకిషన్ పరమార్‌ను నియమించిందని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాకు శ్యాంప్రసాద్‌ను, కిషన్‌ను నియమించిందని వివరించారు.

మందుబాబుల అడ్డాగా ఆరోగ్య ఉపకేంద్రం

» న్యాల్‌కల్ ఆసుపత్రి ఆవరణలో అసాంఘిక చర్యలు » ప్రహరీ లేక అవస్థలు » పట్టించుకోని అధికారులు » రోగుల ఇబ్బందులు

మోపాల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రులు ప్రజల ప్రాణాలు కాపాడే పవిత్ర స్థలాలు. అలా ప్రజల ఆరోగ్యాలను కాపాడాల్సిన ఆసుపత్రి మందుబాబులకు అడ్డాగా మారింది. ఉదయం నుంచే కొందరు బహిరంగంగా తాగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. మోపాల్ మండలం న్యాల్‌కల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.

భయపడుతున్న రోగులు..

న్యాల్‌కల్‌లో రూ.20లక్షల వ్యయంతో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని నిర్మించారు. ఈ ఆసుపత్రి పక్కనే కల్లు దుకాణం ఉండటంతో ఉదయం 6 గంటల నుంచే కొందరు కల్లు సీసాలు తీసుకొని వచ్చి ఆసుపత్రి ఆవరణలో తాగుతున్నారు. ఈ విషయం అందరి కళ్లెదుటే జరుగుతున్నా స్పందించిన వారే కరువయ్యారు. ఆసుపత్రి చుట్టూ పారిశుధ్యం పేరుకుపోయింది. ఆరోగ్యాన్ని



ఆసుపత్రి చుట్టూ పేరుకుపోయిన చెత్తాచెదారం

కాపాడుకోవాలని ఆసుపత్రికి రావాలంటేనే భయంగా ఉందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు ఈ ఆసుపత్రికి 30 నుంచి 50 మంది రోగులు వివిధ కారణాలతో ఆరోగ్య ఉప కేంద్రానికి వస్తూ పోతూ ఉంటారు. రోగులతో పాటు ఆసుపత్రి సిబ్బంది సైతం నిత్యం అవస్థలు పడుతున్నారు.

ప్రహరీ ఏర్పాటు చేస్తే మేలు..

ఆసుపత్రి చుట్టూ ప్రహరీ, కంచె వంటివి లేకపోవడంతో కల్లు తాగే వారు ఉదయం, రాత్రి వేళల్లో అడ్డాగా మార్చుకుంటున్నారు. ఉదయం ఆరోగ్య ఉపకేంద్రం తెరిచాక రోగులు వచ్చే సమయంలో వెనకాల వైపు, లేదా కొంత దూరం వెళ్లి తాగుతున్నారని స్థానికులు చెబుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు లేకపోవడంతో అధికారులు కూడా స్పందించలేకపోతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకొచ్చిన సందర్భాలు ఉన్నాయని వారు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆసుపత్రికి వచ్చే వ్యాధిగ్రస్థులు, సిబ్బంది కోరుతున్నారు.



వేడుకల్లో మాట్లాడుతున్న సీసీఎస్ ఏసీపీ నరేంద్రచారి

బాలల హక్కులను పరిరక్షించాలి

సుభాష్‌నగర్, నవంబరు 20, (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీసీఎస్ ఏసీపీ నాగేంద్రచారి, మహిళ శిశు సంక్షేమ అధికారి రసూల్‌బీ అన్నారు. జిల్లాకేంద్రంలోని రామకృష్ణ మఠ్‌లో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రస్తుతం పిల్లలపై అనేక అరాచకాలు జరుగుతున్నాయని, అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. పిల్లలకు వివక్షకు గురికాకుండా వారి అభ్యున్నతికి బాటలు వేయాలన్నారు. పిల్లలు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని, సమస్యలు వస్తే ఎదురించి విజయం సాధించాలని డాక్టర్ రవికిరణ్ సూచించారు. ఈ సందర్భంగా ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అశ్విని, సీడబ్ల్యూసీ సభ్యులు రాజేంద్రప్రసాద్, జేజేబీ మెంబర్ శ్రీలత, డీసీపీవో చైతన్యకుమార్, రిటైర్డ్ మాస్టర్ గంగాధర్, జీసీడీవో భాగ్యలక్ష్మి, ఇందూరు యువత అధ్యక్షుడు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



వివిధ వేషధారణల్లో విద్యార్థులు, చిత్రంలో అధికారులు

పఠనాసక్తి పెంచుకోవాలి

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు ఇప్పటి నుంచే పఠనాసక్తి పెంచుకోవాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలో గురువారం 58వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. త్వరలోనే సమగ్ర ప్రణాళికతో విద్యార్థులకు, పాఠకులకు సౌకర్యవంతమైన గ్రంథాలయాన్ని రూపొందించే విధంగా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం 50 ఏళ్ల చరిత్ర కలిగి ఉందని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హుందాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి పేర్కొన్నారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. ఉత్తరఖాండ్‌లోని మౌంట్ చంద్రశీల ట్రెక్కింగ్ చేసి గిన్నీస్ బుక్ వరల్డ్ రికార్డు అందుకున్న జిల్లాకు చెందిన ఐదేళ్ల కొత్తకొండ శివప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి, డిప్యూటీ లైబ్రెరియన్ రాజరెడ్డి, న్యాయనిర్ణేతలు అపర్ణ, మంజులరెడ్డి, పద్మజరెడ్డి, రాజేంద్రప్రసాద్, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థలో నెహ్రూ పాత్ర ఎనలేనిది

డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశంలో సహకార భావనను బలపరచడంలో, గ్రామీణ అభివృద్ధి రైతుల శ్రేయస్సు కోసం సహకారం అనే శక్తిని ప్రజల్లో స్థాపించడంలో నెహ్రూ పాత్ర ఎనలేనిది డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో 72 వ అఖిల భారత సహకార వారోత్సవాల ముగింపు వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్, బ్యాంకు అధ్యక్షుడు కుంట రమేష్ రెడ్డి అధ్యక్షతన కార్యక్రమాలు నిర్వహించారు. సహకార ఉద్యమానికి పునాది వేసిన భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూను స్మరించుకున్నారు. దేశ అభివృద్ధి సహకార వ్యవస్థ బలపడ్డప్పుడే సాధ్యమవుతుందని నెహ్రూ దృక్పథం నేటికీ ప్రస్తావనీయం, ఆచరణీయమన్నారు. సహకార ఉద్యమం వల్లనే గ్రామీణ స్థాయిలో ఆర్థిక స్వావలంబన పెరిగి, బ్యాంకు కూడా అదే తత్వంతో ప్రజలకు సేవలందిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సిబ్బంది బ్యాంకు అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, లింగయ్య, ఆనంద్, ఉన్నతాధికారులు లింబాద్రి, శ్రీధర్ రెడ్డి, సుమమాల, సహాయ జనరల్ మేనేజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

మున్నూరుకాపులను ఏకం చేస్తా

» సంఘం నూతన జిల్లా అధ్యక్షుడు ధర్మపురి సంజయ్



మాట్లాడుతున్న మాజీ మేయర్ ధర్మపురి సంజయ్

నిజామాబాద్ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని కులాలను కలుపుకొని, మున్నూరు కాపులను ఏకతాటిపైకి తీసుకువస్తానని మాజీ మేయర్, మున్నూరుకాపు సంఘం నూతన జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ధర్మపురి సంజయ్ తెలిపారు. గురువారం జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్‌లోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నిజామాబాద్ అభివృద్ధే ఎజెండాగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. మున్నూరుకాపు సంఘాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉంద న్నారు. సమష్టి నిర్ణయాలతో సంఘాన్ని బలోపేతం చేయనున్నట్లు సంజయ్ తెలిపారు. ఈనెల 23న ఆదివారం ఉదయం 11 గంటలకు మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా తాను ప్రమాణస్వీకారం చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, మహ్మద్‌అలీ షబ్బీర్, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, మాజీమంత్రి ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు.

మోడిఫైడ్ సైలెన్సర్లు బిగిస్తే చర్యలు

» పోలీసు కమిషనర్ సాయిచైతన్య



మాట్లాడుతున్న సీపీ

సుభాష్‌నగర్, నవంబరు 20, (ఆంధ్ర జ్యోతి): రాయల్ ఎన్ ఫీల్డ్ మోడి ఫైడ్ సైలె న్సర్లు అమ్ము తున్న రంజిత్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు. జిల్లాకేంద్రంలోని పోలీస్ కమిషనరేట్‌లో గురువారం సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నాల్గవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత రాయల్ ఎన్‌ఫీల్డ్ మోడిఫైడ్ సైలెన్సర్లు విక్రయాలు జరుగుతున్నాయని, బిగిస్తున్నారన్న సమాచారం మేరకు నగరంలోని లోహియా, విజయలక్ష్మీ, శివశంకర, లక్ష్మీ నర్సింహ ఆటో మొబైల్స్ దుకాణాల్లో తనిఖీలు చేశామన్నారు. లక్ష్మీ ఆటో మొబైల్‌లో 8 సైలెన్సర్లు, 7 ఇండోర్ సైలెన్సర్లు, షార్ట్ పంజా 1, విజయలక్ష్మీ ఆటోమొబైల్స్‌లో 10, శివశంకర్ ఆటో మొబైల్స్‌లో 11 సైలెన్సర్లను జప్తు చేసినట్లు వెల్లడించారు. నిషేధిత సైలెన్సర్లు అమ్మినా, బిగించినా మెకానిక్‌లకు, నడిపిన వాహనదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మల్టీలెవల్ మార్కెటింగ్ నిందితుల అరెస్ట్

(5వ పేజీ తరువాయి)

విత్‌డ్రా కాకపోవడంతో మోసపోయానని తెలుసుకుని 4వ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా సుమారు నగరంలో 22 మందిని మోసం చేసినట్లు తెలిసింది. బీఎంబీ కంపెనిలో పెట్టుబడి పెట్టి 750 మంది వరకు మోసపోయారని తెలిపారు. మొత్తం డబ్బుల విలువ సుమారు కోటిన్నర వరకు ఉంటుందన్నారు. మోసపూరిత ప్రకటనలకు ప్రజలు ఆకర్షితులు కావొద్దని సీపీ కోరారు. ఈ సమావేశంలో ఏసీపీ బస్తాన్ అలీ, సీఐ సతీష్, ఎస్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

చలి కాలం.. జర భద్రం

(5వ పేజీ తరువాయి)

పగుళ్లు ఏర్పడే అవకాశం ఉండడంతో గుండె వైఫల్యం చెందే ముప్పు ఉంటుంది. కొన్నిసార్లు ఇన్‌ఫెక్షన్ల వల్ల కూడా రక్తనాళాలు రప్చర్ అవుతుంటాయి. చలి ఎక్కువగా ఉంటే వాకింగ్ చేయొద్దు. అధిక బరువు, ఆస్తమా, గుండె జబ్బు ఉన్న వారు వాకింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. చలికాలంలో స్మోకింగ్ చేయడం మానివేయాలి. స్మోకింగ్, విష పదార్థాల వల్ల ముప్పు ఏర్పడుతుంది. ఆల్కహాల్ తీసుకుంటే గుండె సమస్యలు వస్తాయి. గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ బాధితులు అప్రమత్తంగా ఉండాలి. మధుమేహ రోగులు చల్లటి ప్రదేశంలో పడుకోవద్దు. పొగమంచు బారిన పడకుండా ఉండడానికి మాస్కులు ధరించాలి. గోరు వెచ్చటి నీటితో స్నానం చేయాలి. చలిగాలి ఉన్నప్పుడు వృద్ధులు బయట తిరగొద్దు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం

సుభాష్‌నగర్, నవంబరు 20, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ పరీక్షలు ప్రారంభమైనట్లు టీయూ ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఆచార్య గంటా చంద్రశేఖర్ తెలిపారు. విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ సబీసీఎస్ 1వ, 3వ, 5వ రెగ్యూలర్, సెమిస్టర్, 2వ,4వ,6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 30 సెంటర్‌లలో గురువారం నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయన్నారు. ఉదయం 5437 మంది విద్యార్థులకు.. 5193 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 6082 మంది విద్యార్థులు ఉండగా 5645 మంది హజరుకాగా 437 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంట చంద్రశేఖర్ తెలిపారు.

నిధుల దారిమళ్లింపుపై విద్యాశాఖ ఆరా

(5వ పేజీ తరువాయి)

(ఏసీ) బాలోజి నాయక్‌ను విచారణ అధికారిగా జిల్లా విద్యాశాఖ అధికారి నియమించారు. ఈ మేరకు ఆయన గురువారం పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టి నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి అందజేశారు. 2రోజుల క్రితం పీఎంశ్రీ నిధుల విషయమై ఏసీబీ అధికారులు సైతం జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయానికి సైతం వెళ్లి వివరాలు సేకరించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ఇలా ప్రభుత్వ ఉపాధ్యాయులు అవినీతికి పాల్పడడం సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

23న మహాసభ

నిజామాబాద్ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు కె. రామ్మోహన్ రావు కోరారు. గురువారం జిల్లాకేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈనెల 23న జిల్లా 3వ మహాసభలు నిర్వహిస్తున్నామని, పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొనాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, ఈపీఎస్, పెన్షనర్ల సమస్యలపై చర్చిస్తామన్నారు.

జాతీయ జంబోరికి సిరికొండ చిన్నారులు



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయ బృందం

సిరికొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్కౌట్స్, గైడ్స్ జాతీయ జంబోరికి సిరికొండకు చెందిన 11 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 23 నుంచి 29 వరకు లక్నోలో జరుగ నున్న స్కౌట్స్, గైడ్స్ జాతీయ జంబోరికి మండల కేంద్రానికి చెందిన సత్యాశోధక్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అద్వైత్, శ్రీవర్ధన్, విష్ణువర్ధన్, రమనీష్, స్నేహిత్, గైడ్స్ విద్యార్థులు స్నితిక, శ్రీనిధి, రష్మిత, పల్లవి, శృతిక జాతీయ జంబోరిలో పాల్గొంటారని స్కౌట్స్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి కాయిత సాల్మన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం నర్సయ్య, సాల్మన్ అభినందించారు. కార్యక్రమంలో గైడ్ కెప్టెన్ ఎస్.వనిత పాల్గొన్నారు.

దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవ్వాలి

» కేవైసీ పేరుతో 27 లక్షల మంది కూలీలను తొలగించిన సర్కారు

» తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్

నిజామాబాద్ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేవైసీ డిజిటలైజేషన్ పేరుతో 27 లక్షల మంది కూలీలను తొలగించడం గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడవటమేనని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్ పేర్కొన్నారు. ఉపాధి చట్టాన్ని కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాల్సిన అవసరముందని ఆయన పేర్కొన్నారు. గురువారం జిల్లాకేంద్రంలో సంఘం ఆఫీసులో ప్రసాద్ మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టానికి కొర్రీలు పెడుతుందని ఆరోపించారు. నేషనల్ మొబైల్ మోనిటరింగ్ సిస్టం తీసుకొచ్చి ఆధార్‌కార్డు, ఉపాధి జాబ్‌కార్డు, బ్యాంకు అకౌంటు లింకు పేరుతో పేర్లు సరిగా లేవని 7.8 లక్షల జాబు కార్డులను తొలగించడం అన్యాయమన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న బ్యాంకులను క్లబ్‌పేరుతో మూసివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్‌లో తప్పులు సరిచేసుకోవడానికి ఆధార్ సెంటర్లు అందుబాటులో లేవని మండిపడ్డారు. పని ప్రదేశంలో ఉదయం, సాయంత్రం రెండుసార్లు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలనే నిబంధన సరికాదన్నారు. పనులను పరిశీలించేదుకు డ్రోన్ యంత్రాలను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వానికి సాధ్యం కాకపోవడంతో దొడ్డి దారిన బలహీనపరిచే కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. విలీన గ్రామాల్లో ఉపాధిహామీ పనులు తీసివేయడంతో పనులులేని పేదలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఇవ్వాల్సిన డబ్బులు వెంటనే ప్రభుత్వం అందించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేష్, జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి ఏషాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

వైద్యుల కృషి గొప్పది

సుభాష్‌నగర్, నవంబరు 20, (ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైనదని ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. ఐఎంఏ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు గురువారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రూరల్ క్యాంప్ కార్యాలయంలో కలిసి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. రోగులను కాపాడటానికి వైద్యులు ఎంతో కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ విశాల్, సభ్యులు రాజేంద్రప్రసాద్, రవీందర్‌రెడ్డి, జీవన్‌రావు, రామేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న దృశ్యం

రక్తదానంతో మరొకరికి పునర్జన్మ

సుభాష్‌నగర్, నవంబరు 20, (ఆంధ్రజ్యోతి) : రక్తదానం మహాదానమని, రక్తదానం వల్ల మరొకరికి పునర్జన్మ ప్రసాదిస్తామని రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ అధ్యక్షుడు పాకాల నర్సింహరావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వల్ల ఎదుటి వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రక్తదానం చేసేవారికి ఎటువంటి నష్టం ఉండదని పేర్కొన్నారు. ఒక్క యూనిట్ రక్తదానం చేయడం వల్ల మరొక ప్రాణాన్ని కాపాడినవారవుతామని పేర్కొన్నారు. అందరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులతో పాటు ఇతరులు రక్తదానం చేశారు. రక్తదాన శిబిరంలో క్లబ్ సభ్యులు సంపత్, గౌరీశంకర్, రాంప్రసాద్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

పూర్ణకు అండగా ఉంటాం..

(5వ పేజీ తరువాయి)

అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాకాల అభివృద్ధికి సంబంధించిన విషయాలపై అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాకాల-చీమన్‌పల్లి రోడ్డుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని అక్కడే ఉన్నా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు సీతక్క ఆదేశించారు. పాకాలలో రింగ్ రోడ్డు నిర్మాణానికి నిధులున్న పనులు జరుగడం లేదని గిరిజన నాయకులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గ్రామానికి 140 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని బంజార సేవసంఘం మండల అధ్యక్షుడు రూప్‌సింగ్ మంత్రికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గంగారెడ్డి, ఐడీసీఎంఎస్ అధ్యక్షుడు తారచంద్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

దేవి	: రాజు వెడ్స్ రాంబాయి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్	: ప్రేమంటే (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్	: దేదే ప్యార్‌దే-2 (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్	: సీసు రోడ్ ఆఫ్ రివేంజ్ (11.152.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 : కలివి వనం (10.45), 12ఏ రైల్వే కాలనీ (1.30, 7.30, 10.20)
: పాంచ్ మినార్ (4.30)
స్క్రీన్-2 : రాజు వెడ్స్ రాంబాయి (11.00)
: ప్రేమంటే (1.30, 4.30, 7.20, 10.20)
స్క్రీన్-3 : ది గర్ల్‌ఫ్రెండ్(1.45, 7.30),
రాజు వెడ్స్ రాంబాయి(4.30,10.20)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1 : 12 ఏ రైల్వే కాలనీ (10.55, 4.40, 10.20)
: విక్డ్ ఫర్ గుడ్ (ఇంగ్లీష్ 3డి) (1.40, 7.20)
స్క్రీన్-2 : 120 బహద్దూర్ (హిందీ) (11.00, 4.55, 10.50)
: ప్రేమంటే (2.00, 7.55)
స్క్రీన్-3 : సిస్సు రోడ్ టూ రివేంజ్ (12.20, 5.20)
: ఇట్లు మీ వెదవ (2.30), పాంచ్ మినార్ (7.30)
: ది గర్ల్‌ఫ్రెండ్ (10.20)
స్క్రీన్-4 : మస్తీ-4(హిందీ) (11.05,7.40), రాజు వెడ్స్ రాంబాయి(2.10)
: కలివి వనం (5.00)
: దేదే ప్యార్‌దే-2 (హిందీ) (10.45)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,26,000	రూ.1,16,000	రూ.1610

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.270	రూ. 290

